

## తమ్ముడికి అన్నయ్య ఆశీర్వాదం

ఇలవేల్పు ఆంజనేయుని సాక్షిగా అగ్ర నటుడు చిరంజీవి తన తమ్ముడైన పవన్‌కల్యాణ్‌ని ఆశీర్వదించారు. అంతేకాదు, వచ్చే నెలలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తన తమ్ముడు పవన్‌కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీకి ఐదుకోట్ల రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. హైదరాబాద్ శివార్లలోని ముచ్చింతల్‌లో నిర్విరామంగా షూటింగ్ జరుపుకుంటున్న 'విశ్వంభర' షూటింగ్ లొకేషన్ ఈ అన్నదమ్ముల కలయికకు వేదిక అయ్యింది. సోమవారం ఉదయం పది గంటలకు తన చిన్న అన్నయ్య నాగబాబుతో కలిసి 'విశ్వంభర' లొకేషన్‌కి చేరుకున్నారు పవన్‌కల్యాణ్. తన తమ్ముళ్లిద్దర్నీ ప్రేమపూర్వక ఆలింగనంతో స్వాగతం పలికారు మెగాస్టార్. అన్నయ్య ఆశీర్వాదం అందుకున్న పవన్‌కల్యాణ్ భావోద్వేగానికి లోనై చిరంజీవి పాదాలకు నమస్కరించారు. అనంతరం లొకేషన్‌లోనే ముగ్గురు అన్నదమ్ములు కొంతసేపు సంభాషించుకున్నారు. ఇంకా పలువురు జనసేన నాయకులు కూడా చిరంజీవిని కలిసినవారిలో ఉన్నారు.

## హను రాఘవపూడి దర్శకత్వంలో..



తెలుగులో తొలి పాన్‌ఇండియా హీరో అనగానే ఠకీమని వచ్చే సమాధానం ప్రభాస్. అంతటి ఇమేజ్ తర్వాత ఎవరైనా జాగ్రత్తగా నింపాదిగా సినిమాలు చేసుకుంటూ ముందుకెళ్తారు. కానీ ప్రభాస్ మాత్రం గ్యాప్ ఇవ్వకుండా సినిమాలు చేస్తున్నారు. ఇప్పటికే ఓ వైపు 'కల్కి 2898', మరోవైపు 'రాజా సాబ్', ఇంకోవైపు 'సలార్ సౌర్యాంగపర్వం' సినిమాలతో బిజీగా ఉన్నారాయన. ఇవి చాలవన్నట్టు ఇప్పుడు మరో ప్రెస్టేజియస్ ప్రాజెక్ట్‌కి ఓకే చెప్పేశారు. 'సీతారామం' దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో సినిమా చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు ప్రభాస్. ఫిక్షనల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మించనున్నారు. సోమవారం వరంగల్ ఎన్ఐటీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న హను రాఘవపూడి ఈ ప్రాజెక్ట్ గురించి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ చేశారు. 'ప్రభాస్‌తో సినిమా చేయబోతున్నాను. చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ సాగే పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఆ సినిమా ఉంటుంది. విశాల్ చంద్రశేఖర్ ఇప్పటికే ఈ సినిమాకోసం మూడు పాటలను కంపోజ్ చేశారు.' అని తెలిపారు హను రాఘవపూడి.



## టిల్లు మన ఇంటి మనిషిలా మారాడు

'సిద్ధు నటించిన చాలా సినిమాలు చూశాను. కరోనా తర్వాతే ఆయన్ని వ్యక్తిగతంగా కలిశాను. సిద్ధుకి సినిమా అంటే విపరీతమైన పాషన్. తాను చేసే సినిమా గురించే ఎప్పుడూ ఆలోచిస్తుంటాడు. 'డీజే టిల్లు'తో ప్రేక్షకులకు కలకాలం గుర్తుండిపోయే పాత్రను అందించాడు' అన్నారు అగ్ర హీరో ఎన్టీఆర్. సోమవారం జరిగిన 'టిల్లు స్క్వేర్' సక్సెస్‌మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. డబుల్ బ్లాక్‌బస్టర్ పేరుతో సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ ' టిల్లు మన ఇంటి మనిషిలా మారిపోయాడు. ఈ సినిమా చూసినప్పుడు ఇక నవ్వలేను బాబోయ్ అనుకున్నా. ఆ రేంజ్‌లో నవ్వించాడు. యువ హీరోలు విశ్వక్‌సేన్, సిద్ధులను చూస్తుంటే చాలా గర్వంగా అనిపిస్తుంది. కొత్త కథలతో, కాన్సెప్ట్‌లతో ధైర్యంగా సినిమా చేసే ఇలాంటి డేర్ డెవిల్స్ ఇండస్ట్రీకి కావాలి. ఇక 'దేవర' చిత్రం కాస్త లేటయినా మీరందరూ కాలర్ ఎగరేసేలా ఉంటుంది. ఆ సినిమాను గొప్పగా తీర్చిదిద్దుతున్నాం' అన్నారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ 'నాలుగు సంవత్సరాల క్రితం సిద్ధు నాకు ఈ కథ చెప్పాడు. అప్పటి నుంచి ఆ పాత్రతోనే ప్రయాణం చేస్తున్నాడు. టీమ్ మొత్తం టిల్లు పాత్రను బలంగా నమ్మారు. అందుకే ఈ స్థాయి విజయం సాధ్యమైంది' అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ 'ఈ సినిమాపై ఇంత ప్రేమ చూపిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ సినిమా విషయంలో త్రివిక్రమ్‌గారు ఓ మార్గదర్శిలా నిలిచారు. ఆయనతో కలిసి చేసిన ప్రయాణంలో ఎన్నో గొప్ప విషయాలను నేర్చుకున్నాను. నా వ్యక్తిగత జీవితం కూడా మారిపోయింది. ఎన్టీఆర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన ఓ ఓ ఫినామినన్. త్వరలో టిల్లు క్యూబ్ సినిమా కూడా చేయబోతున్నా' అన్నారు.



## గంగమ్మ జాతరలో తగ్గేదేలే..

ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప-2 ది రూల్'. బాక్సాఫీస్ దగ్గర 'పుష్ప ది రైజ్' సృష్టించిన సంచలనమే ఈ హైప్‌కి కారణం. అల్లు అర్జున్, రష్మిక మందన్న, దర్శకుడు సుకుమార్‌ల ఇమేజ్‌లు ఈ సినిమాతో పూర్తిగా మారిపోయాయని చెప్పొచ్చు. అందుకే.. వరల్డ్‌వైడ్ ఆడియన్స్‌కి 'పుష్ప-2 ది రూల్' మోస్ట్ వాంటెడ్ మూవీ. సోమవారం బన్నీ పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసిన టీజర్‌కి విశేషమైన లభిస్తున్నదని, బన్నీ గంగమ్మ జాతర గెటప్‌లో వీర మాస్ అవతార్ అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నదని, టాలీవుడ్‌లో ఇంత విభిన్నంగా ఒక హీరో కనిపించడం ఇదే ప్రథమమని, ఒక్క టీజర్‌తో బన్నీ అంచనాలు పెంచేశారని మేకర్స్ చెబుతున్నారు. ' ఈ టీజర్‌లో బన్నీ చీరకట్టి, కాలు వెనక్కి మడిచి, పైటకొంగును అందుకున్న తీరు తీస్తుంటే, 'పుష్ప'ను ఈ సినిమా అధిగమించడం ఖాయం అనిపిస్తున్నది. టీజర్‌లో బన్నీ యాటిడ్యూడ్, దేవిశ్రీ నేపథ్య సంగీతం మరోసారి ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులంతా పుష్పరాజ్ గురించి మాట్లాడుకునేలా చేశాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సినిమా బన్నీ విశ్వరూపం. ఆగస్ట్ 15న పండుగ చేసుకునేందుకు సిద్ధంగా ఉండండి' అని చిత్ర బృందం పేర్కొంది.

## తగినంత హారర్.. తగినంత కామెడీ..




'ఈ పాయింట్‌ని కోన వెంకట్ నాలుగేళ్ల క్రితమే చెప్పారు. ఆ టైమ్‌లో నేను బిజీ. ఫస్ట్ పార్ట్‌లో చేసిన ఇతర నటీనటులు కూడా బిజీ. అందుకే కుదర్లేదు. ఇప్పుడు నాతోపాటు అందరికీ కుదిరింది. అందుకే వేగంగా సినిమాను పూర్తి చేసేశాం.' అని చెప్పుకొచ్చింది కథానాయిక అంజలి. ఆమె ప్రధానపాత్ర పోషించిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా అంజలి సోమవారం విలేకరులతో ముచ్చటించింది. 'ఫస్ట్ పార్ట్ ఎక్కడ ముగిసిందో సీక్వెల్ అక్కడ మొదలవుంది. ఫస్ట్‌పార్ట్ చూడని వాళ్లకు కూడా ఈ సీక్వెల్ అర్థమవుతుంది. ఇందులోకి పాత పాత్రలతో పాటు కొత్త పాత్రలు కూడా వచ్చి చేరాయి. అలీ, సునీల్, సత్య కూడా ఇందులో భాగం అయ్యారు.' అని తెలిపింది అంజలి. దర్శకుడు శివ తుర్లపాటి కొరియోగ్రాఫర్ కావడం చేత, షాట్ డివిజన్‌పై అవగాహన ఉంది కాబట్టి, పూర్తి క్లారిటీతో డైరెక్ట్ చేశారని, వందశాతం ఎఫర్ట్ పెట్టి అద్భుతంగా సినిమాను మలిచారని అంజలి చెప్పింది. పాత్రధారులంతా అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో పొట్టచెక్కలయ్యేలా చేస్తారని, 'గీతాంజలి' తరహాలోనే తగినంత హారర్, తగినంత కామెడీతో పాటు సాంకేతికంగా కూడా నెక్ట్స్ లెవల్లో సినిమా ఉంటుందని, ఈ ఉగాదికి అందరినీ కడుపుబ్బా నవ్వించడానికే మా గీతాంజలి మళ్లీ వచ్చిందని అంజలి పేర్కొన్నది. ఈ సినిమా తన యాభయ్యవ చిత్రం కావడంపై ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

## బిచ్చగాడు స్థాయి విజయాన్ని లవ్ గురు సాధిస్తుంది



'లవ్ గురు' కథ విన్నాక ఇది నా కెరీర్‌లో 'బిచ్చగాడు' తర్వాత అంత పెద్ద హిట్ అవుతుందని దర్శకుడు వినాయక్‌కు చెప్పాను. మృణాళిని మంచి నటి. ఈ సినిమాలో తన నటన మీ అందర్నీ ఆకట్టుకుంటుంది. ఈ సినిమాతో ఆమెకు నేషనల్ అవార్డ్ వస్తుందని చెప్పగలను. ఇక భరత్ మ్యూజిక్ సూపర్.' అన్నారు విజయ్ ఆంటోనీ. ఆయన కథానాయకుడిగా నటించి, నిర్మించిన చిత్రం 'లవ్ గురు'. మృణాళిని రవి కథానాయిక. వినాయక్ వైద్యనాథన్ దర్శకుడు. రంజాన్ పర్వదిన సందర్భంగా ఈ నెల 11న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన ప్రీరిలీజ్ వేడుకలో విజయ్ ఆంటోనీ మాట్లాడారు. 'ఇందులో నా పాత్ర పేరు లీల. నా కెరీర్‌లో లభించిన గొప్ప పాత్ర ఇది. హీరోతో సమానమైన ప్రాధాన్యత నా పాత్రకు ఉంటుంది. న్యాయం చేశాననే అనుకుంటున్నాను. ఈ సినిమా కోసం నన్ను యాక్టింగ్ క్లాసులకు పంపారు విజయ్ ఆంటోని. ఈ సినిమా చూశాక మీ లైఫ్ పార్ట్‌నర్స్‌తో మీరు మరోసారి ప్రేమలో పడతారు' అని మృణాళిని రవి చెప్పారు. అనుకోకుండా విజయ్ ఆంటోనీ నుంచి వచ్చిన ఊహించని ఫోన్ కాల్ తన కెరీర్‌ని మార్చేసిందని, ప్రేమ ద్వారా యూనివర్స్‌లో ఏదైనా సాధ్యమే అనే అంశాన్ని ఈ కథలో చెబుతున్నామని, నేటి జనరేషన్ ఆడియన్స్‌కి ఈ సినిమా అంకితం ఇస్తున్నానని దర్శకుడు వినాయక్ వైద్యనాథన్ తెలిపారు. ఇంకా మైత్రీ మూవీమేకర్స్ అధినేతలు: నవీన్ యర్నేని, రవిశంకర్, రచయిత భాష్యశ్రీ, సంగీత దర్శకుడు భరత్ ధనశేఖర్, ఇంకా మైత్రీ పంపిణీదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

## నీదేలే నీదేలే జన్మ..



కన్నడ హీరో డార్లింగ్ కృష్ణ స్వీయ దర్శకత్వంలో నటించిన చిత్రం 'లవ్ మోక్టెల్-2'. ఈ సినిమాను అదే పేరుతో తెలుగులో అనువదించి విడుదల చేస్తున్నారు నిర్మాత ఎం.వి.ఆర్.కృష్ణ . త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా 'నీదేలే నీదేలే జన్మ' అంటూ సాగే ఈ సినిమాలోని గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. గురుచరణ్ రాసిన ఈ గీతానికి నకుల్ అభయాన్కర్ స్వరపరచగా సురేంద్రనాథ్ ఆలపించారు. ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే ఓ పాటను, ట్రైలర్‌నీ, టీజర్‌ని విడుదల చేశామని, వాటికి మంచి స్పందన వస్తున్నదని, వేసవి సెలవుల్లో సినిమాను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. మిలీన నాగరాజ్, అమృత అయ్యంగర్, రచల్‌డేవిడ్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు.

## ఫరీదాన్‌ని చూసి ఫిదా అయిపోతున్నారట..

వేశ్యగా నటించడం తేలికైన విషయం కాదు. ప్రవర్తన, శారీరక భాష, మాట తీరు, వేషధారణ, అందం.. ఇలా ప్రతి విషయంలోనూ జాగ్రత్త వహించాలి. 'గంగూభాయ్ కతియావాడి' సినిమాలో ఈ తరహా పాత్రే అలియాభట్‌కు జాతీయ అవార్డును కట్టబెట్టింది. ఇప్పుడు సోనాక్షి సిన్హా వంతు వచ్చింది. 'గంగూభాయ్' తీసిన సంజయ్‌లీలా బన్సాలీనే ఇప్పుడు 'హీరామండి' అనే వెబ్‌సిరీస్ తీస్తున్నారు. ఈ సిరీస్‌లో ఫరీదాన్ అనే వేశ్యగా సోనాక్షి సిన్హా నటిస్తుండటం విశేషం. మనీషా కొయిరాల, రిచా చద్దా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సిరీస్‌కి సంబంధించిన పోస్టర్లూ, వీడియోలు సోషల్‌మీడియాలో సంచలనం సృష్టిస్తున్న నేపథ్యంలో రీసెంట్‌గా సిరీస్‌లోని 'తిలాస్మి బహెన్' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. ఇది సోనాక్షి సిన్హాపై చిత్రీకరించిన గీతం. విటులతో కలిసి తాగిన మత్తులో ఫరీదాన్ ఆడిపాడే ఈ పాట ఇప్పుడు బాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. రీసెంట్‌గా ఈ సిరీస్ ప్రమోషన్‌లో భాగంగా ముంబయ్‌లోని గెయిటీ థియేటర్‌కి వచ్చింది సోనాక్షి. అంతే.. వేలాదిగా వచ్చిన అభిమాన సందోహంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. ఈ గీతంలో సోనాక్షి అందానికీ, అభినయానికి అభిమానులేకాదు, సగటు ప్రేక్షకులు కూడా ఫిదా అయిపోతున్నారట. ఈ పాట గురించి సోనాక్షి మాట్లాడుతూ ''హీరామండి' నా కెరీర్‌లోనే స్పెషల్. ఇందులో ఫరీదాన్ క్యారెక్టర్ కోసం ఎంతో రీసెర్చ్ చేశాను. మంచి పాత్ర ఇచ్చి పోత్సహించిన సంజయ్‌సార్‌కి ధన్యవాదాలు' అంటూ ఆనందం వెలిబుచ్చింది. మే1 ఈ సిరీస్ ప్రసారం కానుంది.



## రియల్ లైఫ్‌ను తలపించే డియర్



'డియర్' కథను ఐశ్వర్య రాజేశ్ నా దగ్గరకు తెచ్చారు. కథ విన్నప్పుడు, ప్రతి సన్నివేశం రియల్ లైఫ్‌తో రిలేట్ చేసుకునేలా అనిపించింది. ఈ కథ భావోద్వేగాల కలబోత. దర్శకుడు ఆనంద్ కథను అద్భుతంగా మలిచాడు.' అని జి.వి.ప్రకాశ్‌కుమార్ అన్నారు. ఆయన హీరోగా నటించిన వినోదభరిత కుటుంబకథా చిత్రం 'డియర్'. ఐశ్వర్య రాజేశ్ కథానాయిక. ఆనంద్ రవిచంద్రన్ దర్శకుడు. వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి.పృథ్వీరాజ్ నిర్మాతలు. ఈ నెల 11న తమిళంలో, 12న తెలుగులో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ వేడుకలో చిత్ర కథానాయకుడు జి.వి.ప్రకాశ్‌కుమార్ మాట్లాడారు. హీరో సందీప్‌కిషన్, నిర్మాత సూర్యదేవర నాగవంశీ, దర్శకులు వెంకీ అట్లూరి, నందిని రెడ్డి అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'భాష ఏదైనా కంటెంట్ బాగుంటే ఆదరించడంలో తెలుగువారు ముందుంటారు. అందుకే ఈ సినిమాను కూడా తప్పక ఆదరిస్తారని నా నమ్మకం. నేను తెలుగమ్మాయిని. ఎప్పట్నుంచో తెలుగులో ఓ స్ట్రయిట్ సినిమా చేయాలనేది నా ఆకాంక్ష. ఇందులో నేను, జీవీ కలిసి నటించిన సీన్లు యూత్‌ని విశేషంగా ఆకట్టుకుంటాయి. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించాడు. సినిమా చూసిన తర్వాత చిరునవ్వుతో బయటికొస్తారు' అని ఐశ్వర్య అన్నారు. గురక పెట్టడం ప్రతి ఇంట్లో ఉండే సమస్యేననీ, దానిపై కథ రాయడం ఎక్సయిటింగ్‌గా అనిపిందనీ, ట్రైలర్‌కి వాయిస్ ఇచ్చిన నాగచైతన్యకు ధన్యవాదాలని దర్శకుడు చెప్పారు. ఇంకా నటి రోహిణి, నిర్మాత త్రిపురనేని వరుణ్, అభిషేక్ రామిశెట్టి కూడా మాట్లాడారు.





